

గ్రూప్‌-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 స్క్రీనింగ్‌ టెస్ట్‌ నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. - 8లో..



భవన నిర్మాణాలకు పూర్తి సహకారం

ప్రజలకు ఉపయోగపడే భవన నిర్మాణాలకు తన పూర్తి సహాయ సహకారాలు అంది స్తానని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4/26.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్‌ వేళలు

ఆదివారం - ఇఫ్తార్‌ : సా॥ 6.25
సోమవారం - సహరీ : ఉ॥ 4.57



న్యూస్‌రీల్‌

రేపటి నుంచి ఇంటర్‌ స్పాట్‌ వాల్యుయేషన్‌

ఒంగోలు: ఇంటర్మీడియెట్‌ స్పాట్‌ వాల్యుయేషన్‌ ఈ నెల 18 నుంచి ఏకేవీకే జూనియర్‌ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ సైమన్‌ విక్టర్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌ బోర్డు ఉత్తర్వులు పొందిన వారంతా మూల్యాంకానికి తప్పక హాజరుకావాలన్నారు. 18వ తేదీ నుంచి తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం, పౌరశాస్త్రం, 22వ తేదీ నుంచి భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం, 26వ తేదీ నుంచి కెమిస్ట్రీ, హిస్టరీ, 28వ తేదీ నుంచి బోటనీ, జువాలజీ, కామర్స్‌ సబ్జెక్టులకు మూల్యాంకనం చేస్తామన్నారు. ఎవరైనా అధ్యాపకులు గైర్హాజరైతే వారికి రూ.25 వేల అపరాధ రుసుం విధిస్తామన్నారు. అంతే కాకుండా కాలేజీ గుర్తింపు రద్దు చేయడం, ఆ కాలేజీ జ్ఞానభూమి పోర్టల్‌ లాగిన్‌ను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు టౌన్‌: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ తెలిపారు. జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లాలోని 38 మండలాల్లో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో రెగ్యులర్‌ విద్యార్థులు 29449 మంది పరీక్షలు రాస్తున్నారని, వీరిలో బాలురు 14,800 మంది, బాలికలు 14,649 మంది ఉన్నారని వివరించారు. ప్రైవేట్‌ విద్యార్థులు 1479 మంది రాస్తున్నారని తెలిపారు. జిల్లాలో 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 170 మంది చీఫ్‌ సూపరింటెండెంట్లు, 170 మంది డిపార్టుమెంటల్‌ ఆఫీసర్లు, 23 మంది సి కస్టోడియన్లు, 1540 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. అలాగే ఇద్దరు జిల్లా స్థాయి స్పెషల్‌ స్క్వాడ్‌ అధికారులను, 9 మంది జిల్లాస్థాయి స్క్వాడ్‌ అధికారులను, 25 మంది సిట్టింగ్‌ స్క్వాడ్‌ అధికారులతో పాటుగా 25 మంది కస్టోడియన్లను నియమించినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు చేస్తున్నామని, సెంటర్లకు సమీపంలోని జిరాక్స్‌ సెంటర్లు, ఇంటర్నెట్‌ సెంటర్లను పరీక్షలు జరిగే సమయంలో మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు తలిదండ్రులతో కలిసి ఒక రోజు ముందుగా పరీక్షా కేంద్రానికి వెళ్లి చూసుకుంటే మంచిదని సూచించారు. తెలుగు, ఇంగ్లిషు మీడియం జవాబు పత్రాలను వేర్వేరుగా ప్యాక్‌ చేసి పరీక్షలు జరిగిన రోజే స్పాట్‌ వాల్యుయేషన్‌కు పంపిస్తామని తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులున్నా, ఏదైనా సమాచారం కావాలన్నా పరీక్షలు కంట్రోలు రూం 7842777239, 7842777439 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జగన్‌ బలగం సిద్ధం

కొత్త, పాత కలయికతో రణరంగంలోకి..



ఒంగోలు పార్లమెంట్‌ అభ్యర్థి

పేరు: డాక్టర్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
విద్యార్హత: ఎంఏ, బీఎల్‌, పీహెచ్‌డీ
తల్లిదండ్రులు: చెవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరాజమ్మ, భార్య లక్ష్మి(గృహిణి)
రాజకీయ నేపథ్యం: 2001లో తిరుపతి రూరల్‌ జెడ్పీటీసీ గెలుపొందారు. జిల్లా స్థాయి సంఘం చైర్మన్‌గా పలు హోదాల్లో విధులు నిర్వర్తించారు. 2008లో తుడా చైర్మన్‌గా, టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమితులయ్యారు. గ్రామాల్లో పలు విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. వైఎస్సార్‌ సీపీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్‌ సేవాదళ్‌ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. వైఎస్సార్‌ సీపీ తరుపున 2014లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శాసనసభ పలు కమిటీల్లో సభ్యులుగా పనిచేశారు. 2019లో చంద్రగిరి నుంచి రెండోసారి విజయం సాధించారు. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, తుడా చైర్మన్‌గా, టీటీడీ పాలకమండలి సభ్యులుగా నాలుగు పదవులను ఏకకాలంలో విజయవంతంగా నిర్వర్తించారు. వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర సమన్వయకర్తగా, ఒంగోలు పార్లమెంట్‌ పార్టీ సమన్వయకర్తగా పనిచేశారు. ఏ పని ప్రారంభించినా విజయవంతం చేస్తారనే పేరు సాధించాడు. అందుకే రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గాల్లో ఒకటైన ఒంగోలు పార్లమెంట్‌ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా చెవిరెడ్డిని పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు. 18 ఏళ్ల క్రితమే గ్రామంలో అద్భుత శ్రీకల్యాణ వెంకన్న ఆలయాన్ని నిర్మించి ఆధ్యాత్మిక సేవ చేస్తున్నారు.

సాక్షి, ప్రతినిధి,ఒంగోలు : సార్వత్రిక ఎన్నికల రణరంగంలో గెలుపే లక్ష్యంగా అధికార వైఎస్సార్‌ సీపీ సైన్యాన్ని దించింది. సామాజిక సమీకరణలకు పెద్ద పీట వేస్తూ దీటైన అభ్యర్థులను ఎంపిక చేసింది. నమ్మకానికి, విధేయతకు పట్టం కట్టింది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికే కాకుండా ఇద్దరు కొత్త వారికి టికెట్లు ఇచ్చింది. జిల్లాలో ఎంపీతో పాటు, అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించింది. ఒంగోలు నియోజకవర్గం మినహా జిల్లాలోని అన్ని స్థానాల్లో మార్పులు చేసింది. ప్రతిపక్ష కూటమికి ముందే నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటించింది. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ దూసుకుపోతున్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా సీనియర్‌ నాయకుడు, అందర్నీ కలుపుకునిపోయే మనస్తత్వం ఉన్న ఎమ్మెల్యే, పార్టీ విప్‌గా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డిని పార్టీ రంగంలోకి దించింది. ప్రజల కోసం ఎందాకైనా పోరాడే వ్యక్తిగా ఆయనకు పేరుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేశారు. ఇక ఒంగోలు కేంద్రంగా ఐదుసార్లు ఎమ్మెల్యే ఎన్నికై , అందరి వాసన్నగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ దఫా విజయదుందుభి మోగించేందుకు సిద్ధమయ్యారు. మాట ఇస్తే తప్పడన్న పేరు సంపాదించుకున్న ఆయన.. ఎన్నికల్లో విజయం సాధించి సిక్సర్‌ కొట్టనున్నారు. రెండు సార్లు మంత్రిగా పనిచేసి బాలినేని జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. 2009 నుంచి వరుసగా విజయాలు సాధించి హ్యాట్రిక్‌ సాధించి జగన్‌ కేబినేట్‌లో రెండు దఫాలుగా మంత్రి పదవి సాధించిన ఆదిమూలపు సురేష్‌ కొండపి నుంచి పోటీ చేస్తున్నారు. విజయాలే చిరునామాగా మార్చుకున్న ఆయన కొండపిలో తొలిసారిగా వైఎస్సార్‌ సీపీ జెండాను ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. ప్రజాక్షేత్రంలో సుదీర్ఘకాలం పాటు కొనసాగుతూ కేబినేట్‌ మంత్రిగా ఉన్న మేరుగ నాగార్జున సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్నారు. గత ఎన్నికల్లో 80 వేల పైచిలుకు మెజార్టీ సాధించి తిరుగులేని విజయాన్ని సాధించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు మార్కాపురం నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. అత్యంత సౌమ్యుడిగా పేరున్న రాంబాబు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతూ సేవా సారథిగా పేరు సాధించారు. జిల్లాలో పేరున్న రాజకీయ కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన కేపీ నాగార్జున రెడ్డి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. మార్కాపురం అభివృద్ధి కోసం పాటుపడ్డ ఆయన ప్రస్తుతం గిద్దలూరు నుంచి పోటీ చేస్తున్నారు. బూచేపల్లి కుటుంబం అంటే జిల్లాలో తెలియని వారుండరు. ఈ కుటుంబం నుంచి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో పోటీకి దిగుతున్నారు. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. తమ ట్రస్ట్‌ ద్వారా తల్లి, జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తనదైన శైలిలో తిప్పికొట్టడమే కాకుండా, నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్‌ తొలిసారిగా యర్రగొండపాలెం నుంచి పోటీ చేస్తున్నారు. అన్ని వర్గాల వారినీ కలుపుకునిపోతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. హెచ్‌ఎంపాడు జెడ్పీటీసీగా ఉన్న దద్దాల నారాయణ కనిగిరి నుంచి బరిలో దిగుతున్నారు. దశాబ్దకాలంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆయన ఎన్నికల్లో తొలిసారి పోటీపడుతున్నారు.



నియోజకవర్గం : ఒంగోలు

అభ్యర్థి పేరు : బాలినేని శ్రీనివాసరెడ్డి
ప్రస్తుత హోదా : ఒంగోలు ఎమ్మెల్యే
విద్యార్హత : బీకాం (డిస్కంటిన్యూ)
సామాజికవర్గం : రెడ్డి
స్వగ్రామం : కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు మండలం కొణిజేడు
ప్రస్తుత నివాసం : ఒంగోలులోని వీఐపీ రోడ్‌
రాజకీయ నేపథ్యం : 1999లో తొలిసారి ఒంగోలు ఎమ్మెల్యేగా ఎన్నిక. అంతకు ముందు యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1999, 2004, 2009లో ఒంగోలు ఎమ్మెల్యే హ్యాట్రిక్‌ సాధించారు. వైఎస్సార్‌ హయాంలో గనుల శాఖా మంత్రిగా చేశారు. వైఎస్సార్‌ మరణానంతరం మంత్రి పదవిని త్యజించి 2012 ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ తరుపున ఘన విజయం సాధించారు. 2014లో తొలిసారి ఓటమి. 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో 6వ సారి ఒంగోలు అసెంబ్లీ నుంచి బరిలోకి దిగుతున్నారు. నియోజకవర్గం అభివృద్ధికి రూ. 1337 కోట్లు ఖర్చు చేశారు.రూ. 1704 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 20 వేల మందికి ఒకేసారి ఇళ్లపట్టాలు ఇచ్చి ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్నారు. కరోనా సమయంలో ఆయన బాధితులకు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేశారు.





నియోజకవర్గం : కొండపి

అభ్యర్థి పేరు : డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌
విద్యార్హత : బీఈ(సివిల్‌), ఎంటెక్‌(సీఎస్‌ఈ), పీహెచ్‌డీ(సీఎస్‌ఈ), ఎఫ్‌ఐఈ, ఎఫ్‌ఐఈటీఈ, సీ.ఈఎన్‌జీ(ఇండియా)
వృత్తి : ఐఆర్‌ఏఎస్‌(వలంటరీ రిటైర్మెంట్‌)
స్వగ్రామం : గజ్జలకొండ, మార్కాపురం మండలం
సామాజికవర్గం : ఎస్సీ మాదిగ
ప్రస్తుత హోదా : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి
రాజకీయ నేపథ్యం : వైఎస్‌ రాజశేఖరరెడ్డి పిలుపుతో ఐఆర్‌ఏఎస్‌ ఉద్యోగానికి వలంటరీ రిటైర్మెంట్‌ ప్రకటించి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో కొత్తగా ఏర్పాటైన యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ తరపున బరిలోకి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో సంతనూతలపాడు నుంచి వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 2019లో యర్రగొండపాలెం నుంచి గెలుపొంది రెండు విడతలు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.



నియోజకవర్గం : సంతనూతలపాడు

అభ్యర్థి పేరు : డాక్టర్‌ మేరుగు నాగార్జున
విద్యార్హత : ఎం.కామ్‌, ఎం.ఫిల్‌, పీహెచ్‌డీ
వృత్తి: ప్రొఫెసర్‌, ఆంధ్రా యూనివర్శిటీ
ప్రస్తుత హోదా : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్‌ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త
స్వగ్రామం : వెల్లటూరు గ్రామం, భట్టిప్రోలు మండలం, గుంటూరు జిల్లా
సామాజిక వర్గం : ఎస్సీ మాల
రాజకీయ నేపథ్యం : ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌ కాంగ్రెస్‌లో పనిచేస్తూ వైఎస్‌ రాజశేఖరరెడ్డికి దగ్గరయ్యారు. ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ.. 2007లో వైఎస్సార్‌ పాలనలో ఉమ్మడి ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌గా నియమితులయ్యారు. 2009లో కాంగ్రెస్‌ తరపున గుంటూరు జిల్లా వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌ అధ్యక్షుడిగా, అధికార ప్రతినిధిగా వివిధ హోదాల్లో పనిచేశారు. వైఎస్‌ జగన్‌ ఆశీస్సులతో 2014, 2019లో వేమూరు నుంచి బరిలోకి దిగారు. 2019లో ఎమ్మెల్యేగా గెలుపొంది, 2021లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.



నియోజకవర్గం : కనిగిరి

అభ్యర్థి పేరు : దద్దాల నారాయణ యాదవ్‌
విద్యార్హత : బీఎస్సీ, బీఈడీ
సామాజిక వర్గం : యాదవ
ప్రస్తుత హోదా : హనుమంతునిపాడు జెడ్పీటీసీ, వైఎస్సార్‌ సీపీ కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి
స్వగ్రామం : వెలిగండ్ల మండలం హుస్సేన్‌పురం పంచాయతీ పెరుగుపల్లి
రాజకీయ నేపథ్యం : దద్దాల నారాయణ తండ్రి దద్దాల పెద మాలకొండయ్య, మాజీ ఉప సర్పంచ్‌, కాంగ్రెస్‌ హయాంలో మాజీ నీటి సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. దద్దాల నారాయణ విద్యార్థి దశ నుంచే వైఎస్సార్‌ అంటే అభిమానం. 2014, 2019 ఎన్నికల్లో కీలకగా వ్యవహరించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో హనుమంతునిపాడు జెడ్పీటీసీగా పోటీ చేసి ప్రత్యర్థిపై 8,900 ఓట్లతో విజయం సాధించారు. 2007 నుంచి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. దద్దాల చారిటబుల్‌ ట్రస్టును స్థాపించి అభాగ్యులకు అండగా నిలిచి ఎంతో మందికి ఆర్థిక సాయం చేశారు.



నియోజకవర్గం : దర్శి

అభ్యర్థి పేరు : బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
విద్యార్హత : ఎంబీబీఎస్‌ **సామాజికవర్గం :** రెడ్డి
ప్రస్తుత హోదా : వైఎస్సార్‌ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి
రాజకీయ నేపథ్యం : తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి(దివంగత మాజీ ఎమ్మెల్యే), తల్లి వెంకాయమ్మ (ప్రస్తుత జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌). 2006లో చీమకుర్తి ఎంపీపీగా చేశారు. 2009లో కాంగ్రెస్‌ తరపున దర్శి ఎమ్మెల్యేగా విజయం. 2014లో వైఎస్సార్‌ సీపీ తరపున పోటీ చేసి 1300 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి. 2019లో వ్యక్తిగత కారణాలతో పోటీకి దూరంగా ఉన్నా ప్రజలతో మమేకమయ్యారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్‌ ట్రస్టు ద్వారా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



నియోజకవర్గం : గిద్దలూరు

అభ్యర్థి పేరు : కేపీ నాగార్జునరెడ్డి
విద్యార్హత : ఎం.ఎస్‌(టెక్సాస్‌)
సామాజిక వర్గం : రెడ్డి
ప్రస్తుత హోదా : మార్కాపురం ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి
స్వగ్రామం : మార్కాపురం మండలం కొండేపల్లి
రాజకీయ నేపథ్యం : 2019లో తొలిసారి వైఎస్సార్‌ సీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తండ్రి కేపీ కొండారెడ్డి 1985, 1989, 1999, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సేవలందించారు. మామ ఉడుముల శ్రీనివాసులురెడ్డి కంభం ఎమ్మెల్యేగా పనిచేశారు. మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్‌ కాలేజ్‌ ఏర్పాటుకు కృషి చేశారు. పొదిలిలో మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు దర్శి సాగర్‌ కెనాల్‌ నుంచి పొదిలిలోని పెద్ద చెరువు వరకు పైప్‌లైన్‌ నిర్మించేందుకు రూ.50 కోట్లు, మార్కాపురం పట్టణానికి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం దూపాడు నుంచి రూ.22 కోట్లతో రెండో మంచి నీటి పైపులైన్‌కు కృషి చేశారు.



నియోజకవర్గం : మార్కాపురం

అభ్యర్థి పేరు : అన్నా వెంకట రాంబాబు
విద్యార్హత : బీఏ
జన్మ స్థలం : కంభం మండలం సైదాపురం గ్రామం
నివాసం : గత 50 ఏళ్ల నుంచి మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్‌
సామాజికవర్గం : వైశ్య
రాజకీయ నేపథ్యం : 2009లో ప్రజారాజ్యం తరపున గిద్దలూరు ఎమ్మెల్యేగా గెలుపు. 2014లో గిద్దలూరు టీడీపీ అభ్యర్థిగా ఓటమి. 2019లో గిద్దలూరు వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా 82 వేల భారీ మెజారిటీతో అఖండ విజయం. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి రావడంతో 4 వేల మందితో తిరుమలకు పాదయాత్ర చేశారు. అన్నా సుబ్బరంగయ్య, ధనలక్ష్మమ్మ చారిటబుల్‌ ట్రస్టు ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



నియోజకవర్గం : యర్రగొండపాలెం

అభ్యర్థి పేరు : తాటిపర్తి చంద్రశేఖర్‌
విద్యార్హత : సివిల్‌ ఇంజినీరింగ్‌(బీఈ)
ప్రస్తుత హోదా: వైఎస్సార్‌ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి
స్వగ్రామం : సింగరాయకొండ
సామాజిక వర్గం : ఎస్సీ మాదిగ
రాజకీయ నేపథ్యం : వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీకి సేవలు అందిస్తున్నారు. 2024లో తొలిసారి యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌ సీపీ తరుపున బరిలోకి దిగుతున్నారు. తాటిపర్తి చారిటబుల్‌ ట్రస్ట్‌ పేరుతో వేసవి కాలంలో కొండపి నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మినరల్‌ వాటర్‌ క్యాంప్‌లు నిర్వహించారు, రోగగ్రస్తులకు, హెచ్‌ఐవీ బాధితులు, వితంతువులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు రక్త శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

కోడ్‌ కూసింది...



ఎన్నికల నిబంధనల గురించి వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌

మొత్తం ఓటర్లు	: 18,11, 614
పురుషులు	: 9,02, 521
మహిళలు	: 9,08,986
థర్డ్‌ జెండర్లు	: 107
కొత్త ఓటర్లు	: 40 వేల మంది
అత్యధికం	: కనిగిరి
అత్యల్పం	: యర్రగొండపాలెం
పోలింగ్‌ బూత్‌లు	: 2183
సమస్యాత్మకం	: 434
పోలింగ్‌కు	: 14,700 మంది
ఎన్నికల విధుల్లో సిబ్బంది	: 25,000 మంది

ఒంగోలు టౌన్‌: 'ఎన్నికల కోడ్‌ అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు' అని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పూర్తిగా సహకరించాలన్నారు. కలెక్టర్‌ కార్యాలయంలోని మినీ సమావేశం మందిరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఎన్నికల నిబంధనల వివరాలు వెల్లడించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,11,614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కొత్తగా ఓటు వేసేందుకు 40 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పుడు ఫాం 7 తీసుకోవడం కుదరదని, అయితే ఇప్పటికీ కొత్త ఓటర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2183 పోలింగ్‌ బూతులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అందులో 434 పోలింగ్‌ బూతులను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రిటర్నింగ్‌ అధికారులు, పోలీసు అధికారుల పరిశీలించి తగిన బందోబస్తుతో పాటు ఇతర చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి పోలింగ్‌ బూతుకు వన్‌ ప్లస్‌ ఫైవ్‌ చొప్పున అధికారులను నియమిస్తామన్నారు. ఎన్నికలకు విధులకు 14,700 మంది ఉద్యోగులను కేటాయించామన్నారు. జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఒక పార్లమెంట్‌ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పార్లమెంటు స్థానానికి కలెక్టర్‌ రిటర్నింగ్‌ అధికారిగా వ్యవహరిస్తారని, అసెంబ్లీలకు వివిధ శాఖలకు చెందిన అధికారులను రిటర్నింగ్‌ అధికారులుగా నియమించనున్నట్లు చెప్పారు. 263 మంది సెక్టార్‌ ఆఫీసర్లను, 40 మంది ఎంసీసీలను, 26 మంది ఎఫ్‌ఎస్‌టీలను, 28 మంది ఎస్‌ఎస్‌టీలు, 16 మంది వీఎస్‌టీ, 8 మంది వీవీటీ, 8 మంది ఏఈఓలను నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు 6,857 మంది పోలీసుల అవసరం ఉంటుందని గుర్తించామని వెల్లడించారు. 1687 మంది జిల్లాలో అందుబాటులో ఉన్నారని, మిగతా సిబ్బంది కోసం ఎన్నికల సంఘానికి సమాచారం ఇచ్చామన్నారు. గత ఎన్నికల్లో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి పోలీసు సిబ్బంది వచ్చారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య కూడళ్లలో విగ్రహాలు, పార్టీ గుర్తులు, చిత్రపటాలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించడం, ముసుగులు వేస్తామన్నారు. మొత్తం మీద 25 వేల మంది వరకు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు.

ప్రతి నియోజకవర్గంలోనూ కంట్రోలు రూం..

ఎన్నికల ఫిర్యాదులు స్వీకరించేందుకు కలెక్టర్‌ కార్యాలయంలో కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి నియోజకవర్గంలోనూ ఒక కంట్రోలు రూంను ఏర్పాటు చేశామన్నారు. 08592 288599కు ఫిర్యాదు చేస్తే 'సి విజిల్‌' యాప్‌కు సమాచారం వెళుతుందన్నారు. ఫిర్యాదులను విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెన్షన్ల పంపిణీ నిరంతర ప్రక్రియ..

పెన్షన్ల పంపిణీ అనేది ఒక నిరంతర ప్రక్రియ అని కలెక్టర్‌ స్పష్టం చేశారు. ఎప్పటిలాగే వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. ఇప్పటి వరకు ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, అసిస్టెంట్‌ కలెక్టర్‌ శౌర్యమన్‌ పటేల్‌, డీఆర్‌ఓ శ్రీలత, డీఎస్పీ కిశోర్‌ బాబు తదితరులు పాల్గొన్నారు.

రండి బాబూ..రండి..

1000+మందు+బిర్యానీ **ప్రజాగళం సభకు తాయిళాలతో ఎర**

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి తొలిసారిగా నిర్వహిస్తున్న 'ప్రజాగళం' సభకు సజనసమీకరణ కోసం తెలుగుదేశం పార్టీ తంటాలు పడుతోంది. ఆదివారం చిలుకలూరిపేట మండలం బొప్పూడి వద్ద నిర్వహిస్తున్న సభకు ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారు. వైఎస్సార్‌ సీపీ నిర్వహించిన నాలుగు సిద్ధం సభలు జన సునామీతో దిగ్విజయం కావడంతో కూటమిలో గుబులు పట్టుకుంది. ఎలాగైనా సభను వియవంతం చేసేందుకు నేతలు తంటాలు పడుతున్నారు. స్వచ్ఛందంగా జనం తరలివచ్చే పరిస్థితి కనిపించలేదు. వాహనాలు సమకూర్చినా అంతంత మాత్రంగానే వచ్చే వాతావరణం ఉండడంతో తాయిళాలకు తెరతీశారు. తొలుత బిర్యానీ, మందు ఇస్తే చాలు అనుకున్నారు. అయితే జనం రాకపోతే పరువుపోతుందన్న భయంతో కొన్ని ప్రాంతాల్లో రూ.500, 1000 మరికొన్ని చోట్ల రూ. 2000 సైతం ఇచ్చి ఆశచూపినట్టుగా తెలుస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో స్లిప్‌లు పంపిణీ చేశారు. అవి చూపించిన వారికి తాయిళాలు ఇస్తున్నారు. మండలాల వారీగా టార్గెట్లు విధించడంతో ద్వితీయ శ్రేణి నాయకులు విస్మయం చెందుతున్నారు. జనం తరలించేందుకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను సిద్ధం చేశారు. తాజాగా టీడీపీలో చేరిన నాయకుడికి గుళ్లాపల్లి గ్రోత్‌ సెంటర్‌లో ఒక కంపెనీ ఉంది. అక్కడ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

కొన్ని ప్రాంతాల నుంచి జనం తరలింపును కూడా అతనే చేస్తున్నట్టు తెలిసింది. వాస్తవానికి ప్రస్తుతం పొగాకు బోర్డు కొనుగోళ్ల ప్రారంభమవటంతో పాటు ఈ సంవత్సరం పొగాకు పనులు ముమ్మరంగా ఉన్నాయని దీంతో ప్రజలు పొలం పనుల కారణంగా సభకు వెళ్లాలంలలంటే ప్రజలు ఆసక్తి చూపటం లేదని టీడీపీ నాయకులు ఇబ్బందులు పడుతున్నారని, ఇటు చూస్తే నేమో నాయకుల ఒత్తిడి బాగా ఉందని దీంతో నజరానా కొట్టి బలవంతంగా తరలించాల్సి వస్తుందని పేరు చెప్పటానికి ఇష్టపడని టీడీపీనేత ఒక వాపోయాడు.

భవన నిర్మాణాలకు పూర్తి సహకారం

● శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపం, కాపుల వృద్ధాశ్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


శ్రీకృష్ణ కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని


కాపు వృద్ధాశ్రమం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు, తదితరులు

ఒంగోలు: ప్రజలకు ఉపయోగపడే భవన నిర్మాణాలకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదురుగా శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం 70 సెంట్ల భూమి కేటాయించింది. అందులో కళ్యాణ మండపం నిర్మాణానికి శనివారం వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే బాలినేని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. యాదవ సామాజికవర్గ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాలినేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కళ్యాణ మండపం నిర్మిస్తే పేదల శుభకార్యాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కళ్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెద్దలు సంప్రదించగానే రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌తో తాను మాట్లాడి స్థలం కేటాయించిన విషయాన్ని బాలినేని గుర్తుచేశారు.

కాపుల వృద్ధాశ్రమానికి శంకుస్థాపన చేసిన బాలినేని...

స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఎదురుగా కేటాయించిన స్థలంలో కాపుల వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఒక మంచి కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాపు వృద్ధుల ఆశ్రమ ఆహ్వాన కమిటీ కార్యదర్శి చాకిరి ధనుంజయరావు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కాపులకు వృద్ధాశ్రమం లేదని, తమ కమ్యూనిటీకి స్థలం కేటాయించాలని కోరగానే ఎమ్మెల్యే బాలినేని స్పందించి అర ఎకరా స్థలాన్ని ప్రభుత్వం ద్వారా కేటాయించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో వృద్ధాశ్రమంతో పాటు కాపులకు ప్రకృతి వైద్యశాల కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. కోశాధికారి బేతంశెట్టి హరిబాబు మాట్లాడుతూ బాలినేనికి కాపు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపం శంకుస్థాపన కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, కార్పొరేటర్లు ఈదర చిన్నారి, అంగిరేకుల గురవయ్య, చల్లా తిరుమలరావు, యనమల నాగరాజు, ఎండేటి పద్మావతి రంగారావు, కండే స్వాతి రమణయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఎండేటి వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ మట్టె రాఘవ, రాష్ట్ర కార్యదర్శి కటారి ప్రసాద్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, వై.వెంకటేశ్వర్లు, నాగమాధురి, సాయి సంజీవ్, డివిజన్ అధ్యక్షుడు చావలి శివ, సీహెచ్ నాగబాబు, జాజుల కృష్ణ, చావలి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినేని మురళి, విస్సుయాదవ్, గండు మధు, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, యర్రాకుల శ్రీనివాసరావు యాదవ్, జాజుల శ్రీను, పందిళ్ల అంజయ్య, రావులపల్లి కృష్ణవేణి, మాధవి, మాధురి, విజయ, రవణమ్మ, లీలాకుమారి, కుట్టుబోయిన కోటి, తాళ్లపాలెం శ్రీను, గాలం సుబ్బారావు, బత్తుల కాశయ్య యాదవ్, వై.శ్రీను, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మోడుబోయిన సురేష్‌యాదవ్, పల్లపోతు మోహన్‌రావు, యాదవ సామాజికవర్గ ప్రతినిధులు పాల్గొనగా, కాపుల వృద్ధాశ్రమానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఒంగోలు క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రామానాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ధూళిపూడి ప్రసాద్‌నాయుడు, శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గాదె వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షుడు మొగిలిపువ్వు సత్యన్నారాయణ, సంయుక్త కార్యదర్శి జల్లిపల్లి పూర్ణ, ప్రచార కార్యదర్శి ఆరిగ ప్రతాప్, మాజీ ఎంఎల్‌ఏ కసుకుర్తి ఆదెన్న, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రూ.121 కోట్లతో దర్శి పట్టణానికి తాగునీరు


మంచినీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

● పథకానికి శంకుస్థాపన చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: దర్శి పట్టణానికి రూ.121 కోట్ల నిధులతో తాగునీరు అందించేందుకు టెండర్లు పూర్తయ్యాయి. సంబంధిత పథకానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రాకపోకలు సాగించే మహిళలకు మరుగుదొడ్ల కొరత ఉందని గుర్తించి వారికి ఇబ్బంది లేకుండా మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా దర్శిలో తాగునీటి ఎద్దడిని గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర మంచినీటి అభివృద్ధి పథకం ద్వారా రూ.121 కోట్లకు టెండర్లు కూడా పూర్తి చేశారన్నారు. ఈ పథకం పూర్తయితే ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇటీవల ఇంటింటి ప్రచారంలో మంచినీటి ఇబ్బందులు ఉన్నాయని ప్రజలు తమతో చెప్పినట్లు తెలిపారు. ప్రజల తాగునీటి కష్టాలన్నీ ఇకపై తీరతాయని సంతోషం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు పూర్తి చేసి తాగునీరు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ కమిషనర్ మహేష్, ఎంపీపీ సుధాఅచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, కౌన్సిలర్లు బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, వెన్నపూస బాపిరెడ్డి, అంబటి వీరారెడ్డి, ఎదురు వెంకటనారాయణరెడ్డి, మజ్జువలి, అన్నవరపు రవి, అంకాల నాగయ్య, ముప్పూరి బ్రహ్మయ్య, కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రగిరి గురవారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

కంభం: ప్రమాదవశాత్తూ పొగాకు బ్యారన్ దగ్ధమై సుమారు రెండున్నర లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన శనివారం రాత్రి మండలంలోని జంగంగుంట్లలో జరిగింది. గ్రామానికి చెందిన రెడ్డెబోయిన నాగేశ్వరరావు బ్యారన్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. అప్పటికే బ్యారన్‌లోని సామగ్రి, పొగాకు దగ్ధమైంది.


దగ్ధమవుతున్న బ్యారన్

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీ వసుంధర


ఓటింగ్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు సిటీ: ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర పిలుపునిచ్చారు. సాధారణ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎస్‌వీఈఈపీ టీమ్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్స్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్స్‌కు ఓటింగ్ గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ వసుంధర మాట్లాడుతూ ఓటింగ్ ప్రాముఖ్యత, ఎథికల్ ఓటింగ్, ఈసీఎల్ వారి మొబైల్ అప్లికేషన్స్ డౌన్‌లోడింగ్, జిల్లా ఎన్నికల అధికారికి సంబంధించిన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ గురించి తెలియజేశారు. వాటిని అందరూ ఫాలో అయ్యేలా అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు డాక్టర్ బి.రవి, జ్యోతి, సిబ్బంది, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన


వసతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు రవి, రమణయ్య

నాగులుప్పలపాడు: సోమవారం నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు కేటాయించిన కేంద్రాల్లో వసతులను మండల విద్యాశాఖాధికారులు రవి, ఈ.వి.రమణయ్య పరిశీలించారు. శనివారం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో వసతులను పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. వసతుల కల్పనలో ఏమాత్రం వెనకాడవద్దని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా వసతులు కల్పించాలని సూచించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞుడిగా ఉంటా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున


మంత్రి మేరుగు నాగార్జునకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాపులు

● వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞుడిగా ఉంటానని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. శనివారం ప్రకటించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థుల జాబితాలో సంతనూతలపాడు సీటు తనకు కేటాయించడంతో నాగులుప్పలపాడులో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి మహానేత వైఎస్సార్ దగ్గరి నుంచి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకు ఇప్పటి వరకు తనకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించారని తెలిపారు. అందుకు శిరస్సు వంచి వారికి నమస్కారం చేస్తున్నానని అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు కల్పించిన సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి అందరినీ కలుపుకుని సంతనూతలపాడు నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తానని మంత్రి నాగార్జున తెలిపారు.

మంత్రి నాగార్జునకు కాపుల శుభాకాంక్షలు...

చీమకుర్తి: చీమకుర్తి మండల కాపులు శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జునను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో కాపులు మర్యాదపూర్వకంగా మంత్రి నాగార్జునను కలిసి అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యేష్ఠ శ్రీనివాసరావు, పాలడుగు సుబ్బారావు, సూది శ్రీనివాసరావు, పీ నాగేశ్వరరావు ఉన్నారు.

గ్రూప్‌-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ పరమేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపు కార్డులు మినహా స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష నియమ నిబంధనలు ఉల్లంఘించి మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు అభ్యర్థులెవరైనా పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. 17వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 స్క్రీనింగ్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసిన క్విస్, పేస్, రైజ్, బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, నాగార్జున, ఎస్.ఎస్.ఎన్, ఏకేవీకే, హర్షిణి డిగ్రీ కాలేజీలు, ఏకేవీకే జూనియర్ కాలేజీ కలిపి మొత్తం 9 కేంద్రాల్లో 6,116 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. గ్రూప్‌-1 పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద ఆర్మ్‌డ్ గార్డులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా సెక్షన్‌-30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు పరుస్తూ అనుమానాస్పద, బయటవ్యక్తులు గుంపులుగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా నిర్దేశించామని, పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జెరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని అన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి మాల్ ప్రాక్టీసు, విమర్శలకు తావు లేకుండా సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడానికి ఇతర శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లలో సూచించిన నియమ నిబంధనలను క్షుణ్ణంగా చదువుకుని పాటించాలన్నారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ప్రతి అభ్యర్థిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష హాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎవరైనా అభ్యర్థులు కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడితే తదుపరి నియామకాల్లో ప్రవేశం జీవితాంతం కోల్పోవడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్ష జరిగే సమయంలో అభ్యర్థులు కాకుండా ఇతరులు ఎవరైన పరీక్ష కేంద్రంలోగానీ, పరీక్ష కేంద్రం వద్దగానీ ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ పరీక్ష కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని తెలిపారు.

చకచకా ఎన్నికల కోడ్ అమలు


ఒంగోలు చర్చి సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు

ఒంగోలు: కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం మధ్యాహ్నం దేశ వ్యాప్తంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి ఎన్నికల కోడ్ అమల్లోకి తీసుకురావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలు తొలగించడం ప్రారంభించారు. గోడలకు అంటించిన పోస్టర్లు, రాజకీయ పార్టీల జెండాలు తీసివేశారు. అదే విధంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.


టీడీపీ ఫ్లెక్సీ తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది






రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది